క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన ఎస్సై


నాగుల్‌మీరా

ఇల్లెందురూరల్: కొమరారం ఎస్సైగా నాగుల్ మీరా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్సైగా పనిచేసిన సోమేశ్వర్ ఆళ్లపల్లి బదిలీ కావడంతో ఆయన స్థానంలో నాగుల్ మీరాను బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు శక్తివంచన మేరకు కృషి చేస్తానని చెప్పారు.

న్యూఢిల్లీ వెళ్లిన సింగరేణి ఉద్యోగులు


ఎన్‌సీఎస్‌సీకు హాజరైన నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): న్యూఢిల్లీలోని భారత మండప ఆడిటోరియంలో సోమవారం జరిగిన నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ క్యాస్ట్ ప్రోగ్రాంకు సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోషియేషన్ నాయకులు వెళ్లారు. సింగరేణి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్‌తోపాటు మరో ఇద్దరు డైరెక్టర్లు, అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అంతోటి నాగేశ్వరరావు, బందెల విజేందర్, మొగిలిపాక రవి, చెరిపెల్లి నాగరాజులకు ఆహ్వానం పంపించారు. ఈ మేరకు వారు ఢిల్లీ వెళ్లారు.

చలివేంద్రం ప్రారంభం


ప్రారంభిస్తున్న ఎస్ఈ మహేందర్

పాల్వంచ: అంబేడ్కర్ జయంతి సందర్భంగా సబ్‌స్టేషన్ ప్రాంగణంలో సర్కిల్ ఎస్సీ, ఎస్టీ విద్యుత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ట్రాన్స్‌కో ఎస్ఈ మహేందర్ సోమవారం ప్రారంభించారు. అనంతరం వసతి గృహ విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందించారు. మాట్లాడుతూ.. అన్నికులాల హక్కుల సాధనకు అంబేడ్కర్ కృషి చేసినట్లు చెప్పారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాప్, ఉదయ్ రత్నకుమార్, శివరంజిని, ఏఓ శ్రీధర్, ఎండీఈలు రాంప్రసాద్, మధు బాబు, ఉమారావు, ఏఈలు పాల్గొన్నారు.

25న ఎన్డీ జిల్లా సదస్సు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాల్వంచరూరల్: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో నిర్వహించనున్న జిల్లా సదస్సుకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నాయకులు వీరమళ్ల మల్లయ్య, ఉమ కోరారు. మందేరకలపాడు, మల్లారం గ్రామంలో సోమవారం జరిగిన సమావేశాల్లో ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గిరిజన చట్టాలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, గిరిజనులు, విద్యార్థులు ఉద్యమించాలన్నారు. సురేష్, మంగయ్య, సింగరావు, సమ్మయ్య, జ్యోతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం

ఇల్లెందురూరల్: బొజ్జాయిగూడెం సమ్మక్క గద్దెల సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బానోత్ నగేష్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. వివరాలు... మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా మండలం నెల్లికుర్తి తండాకు చెందిన నగేష్ భద్రాచలం నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. సమ్మక్క గద్దెల సమీపంలో ఎదురుగా వచ్చిన కారును తప్పించబోయి పక్కనే ఉన్న లోయలో పడిపోయాడు. స్థానికులు 108 సహాయంతో ఇల్లెందు ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం మహబూబాబాద్ ప్రభుత్వాస్పత్రికి సిఫారసు చేశారు.

అంబేడ్కర్ అందరివాడు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను పల్లెలు, పట్టణాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు అధికారులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాల పెద్దలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి బాబా సాహెబ్ అంబేడ్కర్ చేసిన సేవలను కొనియాడారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. రాజ్యాంగ రూపకల్పనలో అంబేడ్కర్ కృషిని కొనియాడారు. పేదల తలరాతలు మార్చేలా రాజ్యాంగాన్ని రూపొందించారని వివరించారు. అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా పలుచోట్ల కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అన్నదానం నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్


ఇల్లెందు: అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


పాల్వంచ: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని, తదితరులు


సింగరేణి మహిళా డిగ్రీ కాలేజీలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ శారద


జూలూరుపాడు: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న స్థానికులు


ఇల్లెందు: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, సింగరేణి జీఎం వీసం కృష్ణయ్య, తదితరులు


చుంచుపల్లి: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


పాల్వంచరూరల్: లక్ష్మీదేవిపల్లిలో నివాళులర్పిస్తున్న జాగృతి నాయకులు


కొత్తగూడెంటౌన్: ఎస్పీ కార్యాలయంలో ..


జిల్లా కోర్టు లైబ్రరీ హాల్‌లో...


సింగరేణి(కొత్తగూడెం): నివాళులర్పిస్తున్న సింగరేణి డైరెక్టర్లు


మాట్లాడుతున్న సింగరేణి జీఎం శాలేంరాజు


ఇల్లెందురూరల్: చల్లసముద్రంలో...


టేకులపల్లి: రాంపురంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..

కేటీపీఎస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


వినోద్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న కేటీపీఎస్ నిర్మాణ కార్మికులు

పాల్వంచ: కేటీపీఎస్ 6వ దశ నిర్మాణంలో పనిచేసిన కార్మికుల సమస్యను పరిష్కరించాలని, అందుకు తన వంతు కృషి చేస్తానని బీజేపీ రాష్ట్ర నాయకులు తాండ్ర వినోద్‌రావు అన్నారు. సోమవారం స్థానిక కేటీపీఎస్ అంబేడ్కర్ సెంటర్‌లో 6వ దశ నిర్మాణ కార్మికులు చేస్తున్న నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వినోద్‌రావు మాట్లాడుతూ... కార్మికులు నిర్మాణంలో ప్రాణాలకు తెగించి పనిచేశారన్నారు. యాజమాన్యం అర్హులైన వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని అంబేడ్కర్ సెంటర్, కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లలో విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శిశు మందిర్ పాఠశాలలో బీజేపీ పటిష్టతకు కృషి చేస్తున్న నాయకులు ఆకుల ఆనంద్, కిరణ్ మొగల్కర్, అశ్విన్, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, దినకర శాస్త్రి, అశోక్‌లను సన్మానించారు. కార్యక్రమంలో గంధం ప్రసాద్, ఎదవల్లి శ్రీనివాస్, సీతారామ్ నాయక్, దున్నపోతుల రాజు, కాల్వ ప్రసాద్, పాషా, వంశీ, రంజిత్ కుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

17న ఢిల్లీలో సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డ్ సమావేశం

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 17న ఢిల్లీలో సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డ్ సమావేశం జరగనుందని ఆ సంఘం అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. సీఎంపీఎఫ్‌లో జరిగిన అక్రమాలు, కనీస పెన్షన్ రూ.5000, ప్రస్తుతం ఉన్న పెన్షన్‌ను అందరికీ చెల్లించుట, పెన్షన్ ఫండ్ పెంపు, నిధులు, కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ వర్తించుట తదితర ములపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు పాషా స్మారక స్తూపావిష్కరణ


పాల్వంచ: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: ఈనెల 15న బయ్యారం మండలంలో నిర్వహిస్తున్న ముక్తార్ పాషా స్తూపావిష్కరణ, బహిరంగ సభకు భారీగా తరలిరావాలని ఇఫ్టూ అనుబంధ టైల్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపూరి వీరభద్రం పిలుపునిచ్చారు. చల్లసముద్రం, ఒడ్డుగూడెం గ్రామపంచాయతీలలోని పెంకు పరిశ్రమలలో సోమవారం విస్తతంగా ప్రచారం చేపట్టారు. మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పెంకు కార్మికులను ఐక్యం చేసి యూనియన్ స్థాపించడం ద్వారా వారి హక్కులకు రక్షణగా నిలిచిన నేత ముక్తార్ పాషా అని కొనియాడారు. యాజమాన్యంతో చర్చలు జరిపి అనేక హక్కులు సాధించిపెట్టారని గుర్తుచేశారు. ఆయన స్మారకార్థం నిర్మించిన స్తూపావిష్కరణకు కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

పాల్వంచ: నేడు మహబుబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేటలో జరగనున్న ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి ముక్తార్ పాషా స్తూపకావిష్కరణ సభను విజయవంతం చేయాలని జిల్లా నాయకులు మంకెన వెంకటేశ్వర్లు, కె.నరసింహారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం నటరాజ్ సెంటర్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ... విప్లవ ఉద్యమంలో, కార్మికరంగం సమస్యలపై ఆయన కృషి మరువలేనిదన్నారు. భాస్కర్, నరసింహారావు, వై.శ్రీను పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


త్రివేణి పాఠశాల 2002 - 03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

పాల్వంచ: కొత్తగూడెం త్రివేణి టాలెంట్ స్కూల్ 2002–03లో పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులను సన్మానించి, సహపంక్తి భోజనాలు చేశారు.

భూభారతి పోర్టల్‌తో రైతులకు మేలు

ఇల్లెందురూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన భూభారతి పోర్టల్‌తో రైతులకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. భూభారతి పోర్టల్, రూల్స్ ప్రారంభోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని సుదిమళ్ల రైతువేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అమలు చేసిన ధరణి పోర్టల్‌తో చాలామంది రైతులు ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. అనుభవదారు కాలం తొలగించడం వల్ల అర్హులైన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకాలను పొందలేకపోయినట్లు చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి పోర్టల్‌తో రైతులు న్యాయం పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ బానోత్ రాంబాబు, పీఏసీఎస్ ఛైర్మన్ మెట్టెల కృష్ణ, మాజీ ఎంపీపీ మోకాళ్ల వెంకటమ్మ, మాజీ సర్పంచ్ కల్తి పద్మ, ఏడీఏ లాల్‌చంద్, ఏఓ సతీష్, రైతులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, అధికారులు

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు


ఇల్లెందు: హరిహరక్షేత్రంలో ప్రత్యేక పూజలు


సూపర్‌బజార్(కొత్తగూడెం): అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

సూపర్‌బజార్(కొత్తగూడెం): శ్రీఅయ్యప్పస్వామి జయంతి సందర్భంగా సోమవారం మండలంలోని పలు ఆలయాల్లో స్వామి వారికి అయ్యప్ప భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పూజారులు పంచామృతాలతో అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా పాపకొల్లు, జూలూరుపాడు, వెంగన్నపాలెం, కాకర్ల, సాయిరాంతండాలో అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): రామవరం పంజాబుగడ్డలో అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పుట్టినరోజు సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఇల్లెందు: అయ్యప్పస్వామి జన్మదినం సందర్భంగా రాష్ట్ర దేవాదయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం శ్రీ హరిహర క్షేత్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తొలుత నిజరూన దర్శనం, అనంతరం పంచామృత అభిషేకములు, మహాపడి పూజ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం మహా అన్నదాన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ గంధి సదానందం హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ధర్మకర్తల మండలి ఈఓ సూర్యప్రకాషరావు పాల్గొన్నారు.

టేకులపల్లి: అయ్యప్ప స్వామి పుట్టినరోజు వేడుకలు సోమవారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. టేకులపల్లిలోని శ్రీకోదండ రామాలయంలో గురుస్వాములు, భక్త బృందం ఆధ్వర్యంలో పూజారి శ్రీరంగం అజయ్ సాయి చక్రి అర్చకత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. అదేవిధంగా తడికలపూడి పంచాయతీ కోక్యాతండాలో శ్రీ మణికంఠ ఆలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

గజిబిజిగా పట్టణ కూడళ్లు

- ట్రాఫిక్ సిగ్నళ్లు లేకపోవడంతో ఇబ్బందులు
- బీసీఎం రహదారిపై పెరుగుతున్న వాహనాల రాకపోకలు
- అలంకార ప్రాయంగా పోలీస్ స్టాండ్‌లు


అంబేద్కర్ కూడలిలో గందరగోళంగా వాహనాల రాకపోకలు

పాల్వంచ: పట్టణంలోని పలు కూడళ్ల వాహనాల రాకపోకలు సాగిస్తున్న సమయంలో సరైన నియంత్రణ లేక గజిబిజిగా మారి ప్రమాదకరంగా మారాయి. అంబేడ్కర్ సెంటర్, దమ్మపేట సెంటర్, నవభారత్ సెంటర్, బస్టాండ్ సెంటర్‌ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ లేని కారణంగా వాహనదారులు పోటీ పడి మరీ టర్నింగ్ తిరుగుతుండటంతో ఎప్పుడు ఎటువైపు నుంచి ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. అంబేద్కర్ సెంటర్ వద్ద బీసీఎం రహదారితో పాటు కిన్నెరసాని ప్రాజెక్ట్, మార్కెట్‌కు, కేటీపీఎస్ కర్మాగారాలకు వెళ్లే దారి కావడంతో నిత్యం ఇక్కడి నుంచి వందలాది వాహనాలు మలుపు తీసుకుంటాయి. అయితే ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో వాహనాలు రాకపోకలతో గందరగోళం నెలకొంటుంది.

ట్రాఫిక్ సిగ్నళ్లు లేక ఇబ్బందులు..

కొత్తగూడెం నుంచి భద్రాచలం వెళ్లే రహదారి కావడం, ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా, ఆంధ్ర తదితర రాష్ట్రాల నుంచి వెళ్లే వాహనాలు, ఇక లోకల్‌గా తిరిగే వాహనాలతో నిత్యం ట్రాఫిక్ రద్దీ ఉంటోంది. దీంతో జంక్షన్లు, టర్నింగ్ పాయింట్లు, డివైడర్ క్రాసింగ్ పాయింట్లు డేంజర్ జోన్లుగా మారిన పరిస్థితి. ఈ ప్రదేశాల్లో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. ముఖ్యంగా అంబేద్కర్ సెంటర్, బస్టాండ్ దాటిన తర్వాత కేటీపీఎస్ సమీపంలో డివైడర్ టర్నింగ్ పాయింట్, కిన్నెరసాని రోడ్‌లో డివైడర్ టర్నింగ్ పాయింట్, లారీ అసోసియేషన హాల్ వద్ద టర్నింగ్ పాయింట్‌లు ప్రమాదకరంగా మారాయి. ఇక్కడ నిత్యం ప్రమాదాలతో పాటు, ప్రమాదంలో మృతి చెందిన సంఘటనలు కూడా ఉన్నాయి. అయితే ట్రాఫిక్ సిగ్నళ్లు లేని కారణంగా ఈ ట్రాఫిక్ నియంత్రణ కరువైందని, ఎవరికి వారు త్వరగా వెళ్లిపోవాలనే ఉద్దేశంతో వెళ్తుండడంతో గందరగోళం నెలకొంది. వాహనదారులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

అడ్డుగా మారిన ట్రాఫిక్ స్టాండ్‌లు..

ఇటీవల కాలంలో బస్టాండ్ సెంటర్, అంబేద్కర్ సెంటర్, లారీ అసోసియేషన్ వద్ద ఐరన్‌తో ట్రాఫిక్ స్టాండ్‌లను ఏర్పాటు చేశారు. అయితే వీటిని పోలీసులు వినియోగించడం లేదు. రోడ్డు క్రాసింగ్‌ల వద్ద ఇవి ఎత్తుగా ఉండటంతో రోడ్డు దాటే వారికి అవతలి వాహనాలు కనిపించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ స్టాండ్‌లే అడ్డుగా మారాయని, డివైడర్‌లు ఎత్తుగా ఉండటం, వాటిపై చెట్లు పెరిగి ఉండటం, మళ్లీ ఈ స్టాండ్‌లు అడ్డుగా ఉండటంతో రోడ్డు దాటే వారికి ఇబ్బందిగా ఉందని పలువురు వాహనదారులు వాపోతున్నారు.


బీసీఎం డివైడర్ వద్ద అలంకారప్రాయంగా పోలీస్ స్టాండ్

సిగ్నళ్లు ఏర్పాటు చేయాలి



పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచలో ట్రాఫిక్ పెరిగింది. వాహనాల సంఖ్య భారీగా పెరిగింది. బీసీఎం రహదారి కావడంతో రెండు, మూడు రాష్ట్రాలకు వెళ్లే వాహనాలు సైతం ఈ రహదారి నుంచే వెళ్తుంటాయి. ఈ నేపథ్యంలో పలు కూడళ్లు డేంజర్‌గా మారాయి. ఎప్పుడు ఎటువైపు నుంచి ప్రమాదం వస్తుందో అర్థం కాని పరిస్థితి. ఈ కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి. – సునీల్

రద్దీ పెరుగుతోంది..



రోజురోజుకు రద్దీ పెరుగుతుండటంతో జాతీయ రహదారిపై వాహనాలు నడపాలంటేనే భయాందోళనకు గురికావాల్సి వస్తోంది. వాహనాలు వచ్చిపోయే సమయంలో అంబేద్కర్ సెంటర్, దమ్మపేట సెంటర్, నవభారత్ వద్ద సరైన నియంత్రణ ఉండటం లేదు. వీటిపై అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలి. ప్రయాణికులకు భరోసా కల్పించాలి. – ఎ.కుమార్, స్థానికుడు

ప్రతిపాదనలు పంపించాం..



ఇక్కడ ట్రాఫిక్ స్టేషన్, సిగ్నల్స్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించాం. పలుచోట్ల వాహనాల స్పీడ్ తగ్గించుకునేలా మార్కింగ్ చేసుకున్నాం. వీటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అంబేద్కర్ సెంటర్, దమ్మపేట సెంటర్, బస్టాండ్ సెంటర్లలో హోంగార్డ్ సిబ్బంది ద్వారా ట్రాఫిక్ మళ్లించే చర్యలు తీసుకున్నాం. వారు విధుల్లో ఉండి ప్రస్తుతం పనిచేస్తున్నారు. – సతీష్, సీఐ, పాల్వంచ

సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ పూజలు


108 కలశాలతో ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణ పరిధిలోని శ్రీపాండురంగ భజన మందిరంలోని శ్రీషిర్డీ సాయిబాబా శ్రీకుసుమహల్ బాబా విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ కే.సులోచన, అర్చకులు శ్రీరంగం వెంకటరమణాచార్యులు, శ్రీరంగం రంగాచార్యులు, పండిత్ దినేష్‌కుమార్‌శర్మ, వేదుల శ్రీరామచంద్రమూర్తి, కంచర్ల మధుకుమారాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 108 కలశాలలతో పవిత్ర పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది.